


APTEL/25/A5250

మన రాజధాని


# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | ఆదివారం 14 జూన్ 2026 | వెల4/-

## నేటి నుండి శబరిమల దర్శనం..



మిథున మాస పూజల నిర్వహణ కోసం ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం సాయంత్రం నుంచి భక్తులకు అందుబాటులోకి రానుంది. జూన్ 19 వరకు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగనున్న నేపథ్యంలో దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.



స్కాములు బయటపడుతున్నాయి...

వ్యవస్థలు ఎందుకు విఫలమవుతున్నాయి?

వేల కోట్ల కుంభకోణాల నుంచి చిట్‌ఫండ్ మోసాల వరకు ఒకే ప్రశ్న

-- ప్రజల డబ్బుకు రక్షణ ఎవరు?

# ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ?

ఎడిటర్ నరేంద్ర



ఆదివారం స్పెషల్...


"ఆర్థిక మోసాలు దేశ ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్‌లాంటివి. మోసం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందుగానే గుర్తించి అడ్డుకోవడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. కఠిన చట్టాలు, పారదర్శక దర్యాప్తులు, వేగవంతమైన శిక్షలు, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపు ద్వారానే స్కాములకు శాశ్వతంగా కళ్లెం వేయగలం."

వివరాలు 2వ పేజీలో

దేశంలో ఆర్థిక మోసాలు కొత్తవి కావు. కానీ వాటి పరిమాణం, ప్రభావం, తరచుదనం మాత్రం రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వేల కోట్ల రూపాయల కార్పొరేట్ కుంభకోణాలు, బ్యాంకు రుణాల ఎగవేతలు, చిట్‌ఫండ్ మోసాలు, పెట్టుబడిదారుల దోపిడీలు, ప్రభుత్వ ప్రాజెక్టులలో అవకతవకలు వరుసగా వెలుగులోకి వస్తున్నప్పటికీ వ్యవస్థలు మాత్రం వాటిని ముందుగానే గుర్తించలేకపోతున్నాయి. మోసం జరిగిన తర్వాత విచారణలు, కమిటీలు, కేసులు, అరెస్టులు కనిపిస్తున్నాయి గానీ, మోసం జరగకుండా అడ్డుకునే యంత్రాంగం కనిపించడం లేదు. ఇదే నేడు దేశ ఆర్థిక వ్యవస్థ ముందున్న అతిపెద్ద సవాలు.

## పెట్టుబడుల వేటలో సింగపూర్‌కు చంద్రబాబు

రాష్టానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం, అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులకు అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు రెండు రోజుల పర్యటన కోసం శనివారం సింగపూర్‌కు బయలుదేరనున్నారు. ఈ సందర్భం గా సింగపూర్ ప్రధాని సహా పలువురు మంత్రులు, పారిశ్రామికవేత్తల తో వరుస భేటీలు నిర్వహించనున్నారు.



## జీ7 వేదికగా మోదీ-ట్రంప్ కీలక భేటీ...


పశ్చిమాసియా మధ్య ద్వైపాక్షిక చర్చలకు ప్రాధాన్యం



ఫ్రాన్స్‌లో జరగనున్న జీ7 శిఖ రాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ , అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భేటీ కానున్నారు. వైట్‌హౌస్ అధికారిక ప్రకటనతో దీనిపై స్పష్టత వచ్చింది. పశ్చిమాసి యాలో కొనసా గుతున్న యుద్ధ సంక్షోభం నేపథ్యంలో ఈ సమావే శానికి అంతర్జాతీయంగా విశేష ప్రాధాన్యం ఏర్పడింది.

## సెప్టెంబరు టీటీడీ షెడ్యూల్..

18 నుండి సేవా దర్శనాలు ప్రత్యేకం...



తిరుమల శ్రీవారి సెప్టెంబరు నెల దర్శనాలు, ఆర్జిత సేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల విడుదలకు టీటీడీ షెడ్యూల్ ఖరారు చేసింది. జూన్ 18 నుంచి వివిధ సేవలకు సంబంధించిన టికెట్లు, కోటాలను దశలవారీగా ఆన్‌లైన్‌లో విడుదల చేయను న్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఖమేనీ అంత్యక్రియలకు షెడ్యూల్ ఖరారు..



ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలకు సంబంధించి అధికారిక షెడ్యూల్ ఖరారైంది. యుద్ధ పరిస్థితుల కారణంగా పలుమార్లు వాయిదా పడిన ఈ కార్యక్రమాలు జూలై 4 నుంచి ప్రారంభం కానుండగా, జూలై 9న ఆయన స్వస్థలమైన మష్హద్‌లో అంతిమ ఖననం నిర్వహించనున్నారు.

## తుని బాలిక ఆచూకీపై పవన్ ప్రత్యేక దృష్టి..

ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన డిప్యూటీ సీఎం ఆదేశం...



తునిలో అదృశ్యమైన బాలిక ఆచూకీ కోసం జరుగుతున్న గాలింపు చర్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ఆరా తీశారు. కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. గాలింపును మరింత వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు బలగాలను రంగంలోకి దించాలని సూచించారు.

## గొలుసుకట్టు చెరువుల పునరుజ్జీవనమే లక్ష్యం....



రాష్ట్రంలో జల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్య ంగా చేపట్టిన జలధార-జలహారతి కార్యక్రమాల్లో గొలు సుకట్టు చెరువుల పునరుద్ధరణకు అత్యంత ప్రాధా న్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికా రులను ఆదేశించారు. వర్షపు నీటిని వృథా కాకు ండా నిల్వ చేసేలా చెరువులు, కాల్వలు, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధి హామీ నిధులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

జలధార-జలహారతి పనుల్లో వేగం పెంచాలి..

నెలాఖరులోగా తొలి విడత పూర్తి చేయాలి

వర్షపు నీటిని ఒడిసిపట్టేలా నీటి వనరుల అభివృద్ధి..

ఉపాధి హామీ నిధుల వినియోగంపై సీఎం దిశానిర్దేశం

## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్



భారత సైన్యానికి తదుపరి ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం భారత సైన్యానికి వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్న ఆయన, జూన్ 30న పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

# నేటి నుండి శబరిమల దర్శనం...

మొదటి పేజీ తరువాయి

కేరళ రక్షణ న్యూస్...

కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయం మిథున మాస పూజల సందర్భంగా రేపటి నుంచి భక్తులకు దర్శనానికి తెరుచుకోనుంది. నెలవారీ పూజల నిర్వహణ కోసం శబరిమల దేవస్థానం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆలయ సంప్రదాయాల ప్రకారం గర్భగుడి తలుపులు తెరవనున్నారు.తంత్రి కందరారు మహేష్ మోహనారు సమక్షంలో ఆలయ ద్వారాలు తెరుచుకోగా, అనంతరం మేళ్‌శాంతి ఈ.డి. ప్రసాద్ చేతుల మీదుగా దీపారాధన నిర్వహించనున్నారు. దీపారాధనతో మిథున మాస పూజలకు అధికారికంగా శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి నెల నిర్వహించే ప్రత్యేక పూజలలో భాగంగా ఈ కార్యక్రమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంటుంది.ఆలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దర్శనాల కోసం ఆన్‌లైన్ వర్చువల్ క్యూ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచింది. భక్తులు ముందస్తుగా తమ దర్శనాలను నమోదు చేసుకుని ఆలయాన్ని సందర్శించవచ్చని అధికారులు సూచించారు. దీంతో రద్దీని నియంత్రించడంతో పాటు భక్తులకు సులభంగా దర్శనం కల్పించేందుకు అవకాశం ఏర్పడనుంది.మిథున మాస పూజల సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, గణపతి హోమం, ఉష పూజ, ఉచ్చ పూజ, దీపారాధన, పుష్పాభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో శబరిమలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతా ఏర్పాట్లను కూడా మరింత పటిష్టం చేశారు. పోలీసులు, దేవస్థానం సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు భక్తులకు అవసరమైన సేవలు అందించనున్నారు.ప్రతి నెల జరిగే పూజల మాదిరిగానే ఈసారి కూడా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. భక్తులు స్వామి దర్శనం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా కేరళతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శబరిమలకు చేరుకునే అవకాశముంది.జూన్ 19 వరకు నెలవారీ ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. అదే రోజు రాత్రి నిర్వహించే చివరి పూజల అనంతరం భక్తులకు వీడ్కోలు పలికి ఆలయాన్ని తిరిగి మూసివేయనున్నారు. తదుపరి ప్రత్యేక పూజల వరకు ఆలయం భక్తుల దర్శనాలకు అందుబాటులో ఉండదు.మిథున మాస పూజల నేపథ్యంలో శబరిమల క్షేత్రం మరోసారి భక్తిరసంతో కళకళలాడనుండగా, అయ్యప్ప భక్తులు స్వామి సన్నిధిలో ఆధ్యాత్మిక అనుభూతిని పొందేందుకు సిద్ధమవుతున్నారు.

# పెట్టుబడుల వేటలో సింగపూర్‌కు చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ న్యూస్...

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రాబట్టడంపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల సింగపూర్ పర్యటనకు సిద్ధమయ్యారు. జూన్ 14న బెంగళూరు నుంచి సింగపూర్‌కు బయలుదేరనున్న ఆయన, అక్కడ ప్రభుత్వ, పారిశ్రామిక, విద్యా రంగాలకు చెందిన ప్రముఖులతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర అభివృద్ధి, అమరావతి నిర్మాణం, పరిశ్రమల స్థాపన, సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడుల ఆకర్షణ ప్రధాన లక్ష్యాలుగా ఈ పర్యటన సాగనుంది.పర్యటన తొలి రోజు భారత హైకమిషనర్ శిల్పక్ అంబులేతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి, అనంతరం స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. రాష్ట్రంలో స్టార్టప్‌లకు ఉన్న అవకాశాలు, కొత్త పెట్టుబడులపై చర్చించనున్నారు. యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనా క్లాడియా రాస్ బాచ్‌తో సమావేశమై పట్టణాభివృద్ధి అంశాలపై అభిప్రాయాలు పంచుకోనున్నారు.సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్, గూగుల్ క్లౌడ్ ఏపీఏసీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ప్రతినిధులు, వైసీహెచ్ లాజిస్టిక్స్ సంస్థ చైర్మన్ రాబర్ట్ యాప్, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రతినిధులతో సీఎం భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, విద్యా భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం వంటి అంశాలు చర్చకు రానున్నాయి.ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ముఖ్యమంత్రి సమావేశం నిలవనుంది. ద్వైపాక్షిక సహకారం, అమరావతి అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చలు జరగనున్నాయి. విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, హోం మంత్రి కె. షణ్ముగమ్, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌లతో కూడా సీఎం భేటీ కానున్నారు.పర్యటన రెండో రోజు కాకతీయ కల్చరల్ అసోసియేషన్ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు ఏపీఏసీ సెమీకండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు. అమరావతి మాస్టర్ ప్లానింగ్‌కు సంబంధించిన సుర్బానా జురాంగ్ సంస్థ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధాని, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్‌తో చర్చలు జరపనున్నారు.అలాగే వరల్డ్ సిటీస్ సమ్మిట్ లీడర్‌షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రపంచ నగరాల అభివృద్ధి నమూనాలు, స్మార్ట్ సిటీలు, సాంకేతిక ఆవిష్కరణలపై జరుగుతున్న ప్రదర్శనలను పరిశీలించనున్నారు. పర్యటన ముగింపులో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్--2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొని రాష్ట్ర పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ వ్యాపార వర్గాలకు వివరించనున్నారు. సీఎం వెంట మంత్రి నారాయణతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా సింగపూర్ పర్యటనలో పాల్గొననున్నారు.

# సెప్టెంబరు టీటీడీ షెడ్యూల్..

మొదటి పేజీ తరువాయి

తిరుమల రక్షణ న్యూస్

తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ కీలక ప్రకటన చేసింది. సెప్టెంబరు నెలకు సంబంధించిన ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల కోటా విడుదల షెడ్యూల్‌ను ప్రకటించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా టికెట్ల కేటాయింపునకు ఏర్పాట్లు చేసింది.టీటీడీ వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల టికెట్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ సేవల కోసం భక్తులు జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.అనంతరం జూన్ 22వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవల టికెట్లను విడుదల చేయనున్నారు. ఈ సేవలకు ప్రతి నెల భారీ డిమాండ్ ఉండటంతో భక్తులు ముందుగానే సిద్ధంగా ఉండాలని టీటీడీ సూచించింది.జూన్ 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటా విడుదల కానుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఈ కోటా ద్వారా అర్హులైన భక్తులు సులభంగా దర్శనం పొందే అవకాశం ఉంటుంది.జూన్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు అత్యంత డిమాండ్ ఉన్న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను విడుదల చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలలోని వసతి గదుల కోటాను కూడా భక్తుల కోసం అందుబాటులో ఉంచనున్నారు.భక్తులు టికెట్లు బుక్ చేసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ అయిన ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే సేవా టికెట్లు, దర్శనాలు, వసతి గదులను బుక్ చేసుకోవాలని సూచించింది. దళారులు, నకిలీ వెబ్‌సైట్లను నమ్మవద్దని హెచ్చరించింది.సెప్టెంబరు నెలలో శ్రీవారి దర్శనం కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది భక్తులు విడుదల తేదీలను గుర్తుంచుకుని ముందస్తుగా తమ బుకింగ్‌లను పూర్తి చేసుకోవాలని టీటీడీ అధికారులు సూచించారు.

# ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ?

మొదటి పేజీ తరువాయి

ఎడిటర్ నరేంద్ర ఆదివారం స్పెషల్...

దేశంలో నేరాల స్వరూపం మారిపోయింది. ఒకప్పుడు దొంగతనాలు, దోపిడీలు, అక్రమ రవాణా వంటి నేరాలు ప్రధానంగా ఉండేవి. ఇప్పుడు ఆర్థిక నేరాలే అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఒక వ్యక్తి చేతిలో తుపాకీ ఉంటే కొందరు మాత్రమే నష్టపోతారు. కానీ ఒక కార్పొరేట్ సంస్థ తప్పుడు లెక్కలు చూపితే లక్షలాది మంది పెట్టుబడిదారులు నష్టపోతారు. ఒక బ్యాంకు రుణం ఎగవేస్తే ప్రజల పన్నుల డబ్బు ప్రమాదంలో పడుతుంది. అందుకే ఆర్థిక నేరాలు కేవలం చట్టపరమైన సమస్య కాదు; అవి దేశ ఆర్థిక భద్రతకు సంబంధించిన అంశం.భారతదేశంలో ఆర్థిక మోసాల చరిత్రను పరిశీలిస్తే ఒక విచిత్రమైన సామ్యాన్ని గమనించవచ్చు. ప్రతి పెద్ద స్కాం బయటపడినప్పుడు “ఇది ఎలా జరిగింది?” అనే ప్రశ్న కంటే “ఇంతకాలం ఎవరికీ తెలియలేదా?” అనే ప్రశ్న ఎక్కువగా వినిపిస్తుంది. హర్షద్ మెహతా స్కాం నుంచి సత్యం కంప్యూటర్స్ వరకు, విజయ్ మాల్యా నుంచి నీరవ్ మోడీ వరకు, సహారా నుంచి అగ్రిగోల్డ్ వరకు దాదాపు ప్రతి కేసులో ఇదే పరిస్థితి కనిపించింది.1992లో వెలుగులోకి వచ్చిన హర్షద్ మెహతా స్కాం భారత ఆర్థిక చరిత్రలో మలుపు. బ్యాంకింగ్ వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించి వేల కోట్ల రూపాయల షేర్ మార్కెట్ కుంభకోణానికి పాల్పడ్డాడు. ఆ ఘటన తర్వాత నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సెబీ అధికారాలను పెంచింది. కానీ కొన్నేళ్లకే కొత్త స్కాములు పుట్టుకొచ్చాయి. అంటే సమస్య వ్యక్తుల్లో మాత్రమే లేదని, వ్యవస్థలో కూడా ఉందని అర్థం.2009లో సత్యం కంప్యూటర్స్ వ్యవహారం దేశాన్ని కుదిపేసింది. దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ సంస్థగా పేరుగాంచిన కంపెనీ తన ఖాతాల్లో వేల కోట్ల రూపాయల తప్పుడు లెక్కలు చూపిందని బయటపడింది. ఒక సంస్థ సంవత్సరాల తరబడి తప్పుడు లెక్కలతో నడుస్తున్నా ఆడిటర్లు, నియంత్రణ సంస్థలు, పెట్టుబడిదారులు గుర్తించలేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. అప్పట్లో ఇది భారత కార్పొరేట్ గవర్నెన్స్‌కు పెద్ద దెబ్బగా భావించారు.తర్వాత విజయ్ మాల్యా వ్యవహారం వచ్చింది. బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. నీరవ్ మోడీ కేసులో కూడా దాదాపు అదే జరిగింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల వ్యవస్థలో ఉన్న బలహీనతలను ఉపయోగించుకుని భారీ మోసాలు జరిగాయి. ఈ కేసులు కేవలం వ్యక్తుల తెలివితేటలకు నిదర్శనం కాదు; వ్యవస్థల నిర్లక్ష్యానికి కూడా సాక్ష్యం.ఇటీవల వెలుగులోకి వచ్చిన రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ వ్యవహారం కూడా ఇదే కోవలోకి వస్తుంది. ఒక సాధారణ పెట్టుబడిదారుడి ఫిర్యాదుతో ప్రారంభమైన విచారణలో భారీ స్థాయి అక్రమాలు బయటపడుతున్నాయి. ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే -- ప్రభుత్వ నియంత్రణ సంస్థలు, ఆడిట్ వ్యవస్థలు, పర్యవేక్షణ యంత్రాంగాలు ఉండగా ఒక సాధారణ పౌరుడు గుర్తించిన విషయాన్ని అవి ఎందుకు గుర్తించలేకపోయాయి?ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే మనకు వ్యవస్థాగత లోపాలు కనిపిస్తాయి. భారతదేశంలో నియంత్రణ సంస్థలు ఉన్నప్పటికీ వాటి మధ్య సమన్వయం కొరవడుతోంది. సెబీ ఒక వైపు, రిజర్వ్ బ్యాంక్ మరో వైపు, కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇంకో వైపు పనిచేస్తున్నాయి. సమాచార మార్పిడి వేగంగా జరగడం లేదు. ఫలితంగా ఒక సంస్థపై అనుమానాలు ఉన్నప్పటికీ వాటిని సమగ్రంగా విశ్లేషించే అవకాశం తగ్గుతోంది.ఆర్థిక మోసాలకు మరో ప్రధాన కారణం రాజకీయ-ఆర్థిక సంబంధాలు. కార్పొరేట్ సంస్థలు, రాజకీయ పార్టీలు, అధికార వ్యవస్థల మధ్య ఏర్పడే అనుబంధాలు కొన్నిసార్లు దర్యాప్తులను ప్రభావితం చేస్తున్నాయన్న విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. ఆరోపణలు వచ్చిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సిన సందర్భాల్లో కూడా రాజకీయ లెక్కలు ముందుకు రావడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. భారీ ప్రాజెక్టుల వ్యయాలు, టెండర్లు, నిర్మాణ పనులపై వివాదాలు వచ్చినప్పుడు పూర్తిస్థాయి పారదర్శక విచారణలు జరగడం అరుదుగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు ఒక పార్టీ చేసిన పనులను ప్రతిపక్షం విమర్శిస్తుంది. అధికార మార్పు తర్వాత విచారణలు చేస్తామని చెబుతుంది. కానీ చివరికి కేసులు రాజకీయ ఆరోపణలుగానే మిగిలిపోతున్నాయి. ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరం. చిట్‌ఫండ్ సంస్థలు, మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీలు, అధిక లాభాల హామీలతో ప్రజలను ఆకర్షించే పథకాలు ఇప్పటికీ వేలాది మందిని మోసం చేస్తున్నాయి. చదువుకున్నవారు కూడా ఈ ఉచ్చులో పడుతున్నారు. కారణం ఒక్కటే -- త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశ. ఈ ఆశను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు కొత్త కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారు.సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్దీ మోసాల రూపం కూడా మారుతోంది. ఒకప్పుడు నకిలీ పత్రాలు, తప్పుడు రసీదులు ఉపయోగించేవారు. ఇప్పుడు డిజిటల్ లావాదేవీలు, క్రిప్టో కరెన్సీలు, అంతర్జాతీయ షెల్ కంపెనీలు, ఆఫ్‌షోర్ ఖాతాలు ఉపయోగిస్తున్నారు. సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, మోసగాళ్లు కూడా అంతే వేగంగా కొత్త మార్గాలను కనుగొంటున్నారు.అయితే ఇక్కడ ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకం. కేవలం స్కాం బయటపడిన తర్వాత చర్యలు తీసుకోవడం సరిపోదు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు అభివృద్ధి చేయాలి. కృత్రిమ మేధస్సు, బిగ్ డేటా అనలిటిక్స్, రియల్ టైమ్ ఫైనాన్షియల్ మానిటరింగ్ వంటి సాంకేతికతలను వినియోగించాలి. అనుమానాస్పద లావాదేవీలను వెంటనే గుర్తించే వ్యవస్థలు ఉండాలి.అలాగే ఆడిట్ వ్యవస్థలో సంస్కరణలు అవసరం. చాలా సందర్భాల్లో ఆడిట్ నివేదికలు కేవలం ప్రక్రియగా మారిపోయాయి. ఆడిటర్ల బాధ్యతను మరింత పెంచాలి. తప్పుడు నివేదికలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాలను మరింత కఠినతరం చేయాలి.అత్యంత ముఖ్యమైన అంశం శిక్ష. భారతదేశంలో పెద్ద ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు సంవత్సరాల తరబడి సాగుతుంటాయి. ఈ ఆలస్యం నిందితులకు ప్రయోజనం కలిగిస్తోంది. వేగవంతమైన ప్రత్యేక కోర్టులు, సమయపాలిత విచారణలు, ఆస్తుల స్వాధీనం వంటి చర్యలు తప్పనిసరి.ప్రజల పాత్ర కూడా కీలకమే. అధిక లాభాల పేరుతో వచ్చే ప్రతి ఆఫర్‌ను నమ్మకూడదు. పెట్టుబడులు పెట్టే ముందు సంస్థల విశ్వసనీయతను పరిశీలించాలి. ఆర్థిక అక్షరాస్యతను పెంచాలి. ప్రజలు అప్రమత్తంగా ఉంటే అనేక మోసాలను ముందుగానే అడ్డుకోవచ్చు.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలపై విశ్వాసం, ఆర్థిక వ్యవస్థపై నమ్మకం అత్యంత విలువైన ఆస్తులు. ఒకసారి ఆ విశ్వాసం దెబ్బతింటే తిరిగి సంపాదించడం కష్టం. అందుకే ఆర్థిక మోసాలను కేవలం నేరాలుగా కాకుండా దేశ అభివృద్ధికి అడ్డంకులుగా చూడాలి.ఆర్థిక నేరాలకు వ్యతిరేకంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు అవసరం. రాజకీయ సంకల్పం, బలమైన చట్టాలు, ఆధునిక సాంకేతికత, పారదర్శక విచారణలు, కఠిన శిక్షలు -- ఇవన్నీ కలిసివస్తేనే మార్పు సాధ్యమవుతుంది. లేకపోతే ప్రతి కొన్ని నెలలకు ఒక కొత్త స్కాం బయటపడుతుంది. కొద్దిరోజులు చర్చ జరుగుతుంది. తర్వాత ప్రజలు మరిచిపోతారు. కానీ నష్టం మాత్రం దేశానికే మిగులుతుంది. అదే నేడు భారత ఆర్థిక వ్యవస్థ ముందున్న అతిపెద్ద హెచ్చరిక.

# భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ రక్షణ న్యూస్...

భారత సైన్యానికి కొత్త అధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రక్షణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం భారత సైన్యానికి వైస్ చీఫ్‌గా విధులు నిర్వహిస్తున్న ధీరజ్ సేథ్, దేశ అత్యున్నత సైనిక పదవిని చేపట్టనున్నారు.ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజున ధీరజ్ సేథ్ భారత సైన్యాధిపతిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. సుదీర్ఘ సైనిక అనుభవం, వ్యూహాత్మక నాయకత్వం, వివిధ కీలక బాధ్యతల్లో సమర్థవంతమైన సేవల కారణంగా ఆయనకు ఈ పదవి దక్కినట్లు రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి.లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ భారత సైన్యంలో పలు కీలక హోదాల్లో పనిచేశారు. సరిహద్దు ప్రాంతాల్లో ఆపరేషన్లు, వ్యూహాత్మక ప్రణాళికలు, సైనిక ఆధునీకరణ కార్యక్రమాల్లో ఆయన విశేష పాత్ర పోషించారు. ప్రస్తుతం వైస్ చీఫ్‌గా సైన్య నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.దేశ భద్రతకు సంబంధించిన సవాళ్లు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ధీరజ్ సేథ్ నాయకత్వంలో భారత సైన్యం మరింత బలోపేతం అవుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాంకేతికత ఆధారిత యుద్ధ సామర్థ్యాల పెంపు, సరిహద్దు భద్రత, ఆధునిక ఆయుధ వ్యవస్థల వినియోగం వంటి అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని భావిస్తున్నారు.ధీరజ్ సేథ్ నియామకంతో భారత సైన్యానికి కొత్త నాయకత్వం లభించనుండగా, దేశ రక్షణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా ముందుకు నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

# ఖమేనీ అంత్యక్రియలకు షెడ్యూల్ ఖరారు...

ఇరాన్ రక్షణ న్యూస్...

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించింది. ఫిబ్రవరి 28న జరిగిన వైమానిక దాడుల్లో మరణించిన ఖమేనీకి దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. భద్రతా, యుద్ధ పరిస్థితుల కారణంగా గతంలో పలుమార్లు వాయిదా పడిన అంత్యక్రియలు చివరకు జూలై తొలి వారంలో నిర్వహించనున్నారు.ప్రకటన ప్రకారం జూలై 4న రాజధాని టెహ్రాన్‌లో అంత్యక్రియల కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం మూడు రోజుల పాటు టెహ్రాన్‌లో ఉంచనున్నారు. దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రజలు, మతపెద్దలు, రాజకీయ నాయకులు ఆయనకు నివాళులర్పించే అవకాశం కల్పించనున్నారు.జూలై 7న ఇరాన్‌లోని పవిత్ర నగరం కోమ్‌లో ప్రత్యేక ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. షియా మతానికి కేంద్రబిందువుగా భావించే ఈ నగరంలో ఖమేనీ సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా మసీదులు, మత సంస్థలు కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.అనంతరం జూలై 9న ఖమేనీ స్వస్థలమైన మష్హద్ నగరానికి ఆయన భౌతికకాయాన్ని తరలించనున్నారు. అక్కడి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ఇమామ్ రెజా ష్రైన్ సమీపంలో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ ఖననం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఇరాన్ ప్రభుత్వ ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులు, మతపెద్దలు హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.అలీ ఖమేనీ ఇరాన్ రాజకీయ, మత రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన మరణం తర్వాత దేశ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అంత్యక్రియల సందర్భంగా దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు.ఖమేనీకి తుది వీడ్కోలు పలికేందుకు లక్షలాది మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో టెహ్రాన్, కోమ్, మష్హద్ నగరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆయన అంత్యక్రియలు ఇరాన్ చరిత్రలో అత్యంత భారీ స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జీ7 వేదికగా మోదీ-ట్రంప్ కీలక బేటి...

మొదటి పేజీ తరువాయి

ఫ్రాన్స్ రక్షణ న్యూస్

ఫ్రాన్స్‌లోని ఎలెవన్ లెస్ బెనలిస్ నగరంలో జూన్ 15 నుంచి 17 వరకు జరగనున్న +7 సమ్మిట్ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య కీలక భేటీ జరగనుంది. ఈ విషయాన్ని వైట్‌హౌస్ అధికారికంగా ప్రకటించడంతో అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.జీ7 కూటమిలో సభ్యదేశం కాకపోయినా, భాగస్వామ్య దేశంగా భారత్‌కు ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ సదస్సులో పాల్గొననున్నారు. సదస్సు సందర్భంగా ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భద్రతా సవాళ్లు, ఇంధన భద్రత, కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పులు వంటి అంశాలతో పాటు పలు ద్వైపాక్షిక సమావేశాలు కూడా జరగనున్నాయి.ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఇంధన మార్కెట్లపై వాటి ప్రభావం వంటి అంశాలు మోదీ-ట్రంప్ చర్చల్లో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత, రక్షణ సహకారం, వాణిజ్య సంబంధాలు, సాంకేతిక భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా ఇరువురు నేతలు చర్చించనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.గత ఏడాది ఫిబ్రవరిలో అమెరికా పర్యటన సందర్భంగా మోదీ, ట్రంప్ చివరిసారిగా సమావేశమయ్యారు. ఆ తర్వాత ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో అనేక మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా భేటీపై ప్రపంచ దేశాలు దృష్టి సారించాయి.భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశం కీలకంగా మారే అవకాశముందని దౌత్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. జీ7 వేదికగా జరగనున్న ఈ భేటీ ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త దిశానిర్దేశం చేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## తుని బాలిక ఆచూకీపై పవన్ ప్రత్యేక దృష్టి..

తుని రక్షణ న్యూస్

తూర్పుగోదావరి జిల్లాలోని తుని ప్రాంతానికి చెందిన బాలిక అదృశ్యం ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. బాలిక ఆచూకీ కోసం జరుగుతున్న గాలింపు చర్యలపై కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగంతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన పవన్ కళ్యాణ్, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, గాలింపు పురోగతి, వినియోగిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికను సురక్షితంగా గుర్తించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఆయన, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.ప్రస్తుతం రాష్ట్ర విపత్తు స్పందన దళం (SDRF), పోలీసులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పవన్‌కు వివరించారు. అయితే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మరిన్ని బలగాలను రంగంలోకి దించాలని, అవసరమైతే జాతీయ విపత్తు స్పందన దళం (NDRF) సేవలను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు.అదృశ్యమైన బాలిక కోసం పరిసర ప్రాంతాలు, జలాశయాలు, కాలువలు, అడవి ప్రాంతాలు సహా అన్ని కోణాల్లో గాలింపు కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లు, ప్రత్యేక శోధన బృందాల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని సూచించినట్లు సమాచారం.బాలిక కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కేసు దర్యాప్తు మరియు గాలింపు చర్యలపై నిరంతరం సమీక్ష కొనసాగుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి. మరోవైపు స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కూడా గాలింపు కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నారు.బాలిక ఆచూకీ లభించే వరకు శోధన చర్యలను మరింత విస్తృతంగా కొనసాగించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించగా, జిల్లా యంత్రాంగం అన్ని వనరులను సమీకరించి గాలింపును ముమ్మరం చేసింది.



# సెమీఫైనల్‌లో సింధుకు ఓటమి

## యమగుచి చేతిలో పరాజయం

## టోర్నమెంట్ నుంచి నిష్క్రమణ

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. 2026 ఆస్ట్రేలియా ఓపెన్ సెమీఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోయింది. శనివారం జరిగిన సెమీస్‌లో జపాన్ క్రీడాకారిణి అకానె యమగుచిని ఢీకొట్టిన సింధు 22-20, 21-12 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. దీంతో 2026లో తొలి టైటిల్ కోసం సింధు ఎదురుచూపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ మ్యాచ్?లో తొలి సెట్ హోరాహోరీగానే సాగింది. యమగుచికి సింధు అద్భుతంగా బదులిచ్చింది. బ్రేక్ టైమ్ దాకా సింధునే ఆధిక్యంలో ఉంది. అయితే విరామం తర్వాత యమగుచి పుంజుకుంది. వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌పై పట్టు సాధించింది. సింధు కూడా తిరిగి పుంజుకుని మళ్లీ లీడ్‌లోకి వచ్చింది. ఇలా ఈ సెట్ చివరిదాకా ఉత్కంఠభరితంగా సాగింది. ఆఖరికి సింధు 22- 20 తేడాతో మొదటి సెట్‌ను కోల్పోయింది. ఇక రెండో సెట్ దాదాపు వన్‌సైడ్‌గా మారింది. యమగుచి ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించింది. వరుసగా ఏడు పాయింట్లు రాబట్టి 13- 6తో మ్యాచ్‌పై పట్టు నిలుపుకుంది. ఆ తర్వాతా జోరు కొనసాగించిన యమగుచి రెండో సెట్‌ను 12- 21 భారీ తేడాతో నెగ్గి మ్యాచ్‌లో విజయం సాధించింది. వరసగా రెండు సెట్లలో నెగ్గిన యమగుచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక రేపు జరగనున్న ఫైనల్‌లో యమగుచి, థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పావి చోచువాంగ్‌తో తలపడనుంది.కాగా, ఈ ఏడాది సింధు ఇప్పటిదాకా ఒక్క టైటిల్ కూడా నెగ్గలేదు. ఆమె ఈ టోర్నీకి ముందు సింగపూర్, థాయ్?లాండ్, ఇండోనేసియా ఓపెన్ సూపర్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాకా వెళ్లింది. కానీ క్వార్టర్స్‌లో ఓడిపోయింది. ఇక మలేసియా ఓపెన్ 500లోనూ సెమీఫైనల్ దాకా చేరుకుంది. సెమీస్?లో చైనాకు చెందిన వాంగ్ జియితో 21-16, 21-15 తేడాతో సింధు ఓడింది. ఓవరాల్‌గా ఈ ఏడాది సింధుకు మలేసియా, ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీలు అత్యుత్తమ ప్రదర్శనలుగా చెప్పవచ్చు! రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు 2024లో లఖ్‌నవూలో జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్‌లో దీఔఖీ సర్క్యూట్‌లో చివరిసారిగా టైటిల్ గెలుచుకుంది. మరోవైపు ఇదే టోర్నమెంట్‌లో మరో యువ భారత క్రీడాకారిణి తన్వి శర్మ కూడా క్వార్టర్ ఫైనల్స్‌లోనే నిష్క్రమించింది. ఆమెను కూడా యమగుచినే ఓడించింది. అంతేకాకుండా, పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్లు కిరణ్ జార్జ్, తరుణ్ మనేపల్లి అనూహ్య ఓటములను చవిచూశారు. ఇక మహిళల సింగిల్స్‌లో సింధు, తన్వి శర్మ కూడా ఇంటి బాట పట్టడంతో భారత అభిమానులు నిరాశకు గురవుతున్నారు.ఈ మ్యాచ్?కు ముందు సింధు రౌండ్ 32లో కాస్టిలోను మట్టికరిపించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు 21-13, 21-11 వరుస సెట్లలో నెగ్గింది. ఆ తర్వత రౌండ్ 16లో భారత ప్లేయర్ బరువాను ఢీ కొట్టింది. ఈ పోరులో ఆమె 22-20, 21-12 తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్?కు అర్హత సాధించింది. అక్కడ ఎస్ షెన్?ను ఢీ కొట్టిన సింధు పూర్తిగా ఆధిపత్యం చలాయించింది. ఏకంగా 21- 6, 21- 9 భారీ తేడాతో గెలుపొంది సెమీస్‌కు దూసుకొచ్చింది. తాజాగా సెమీస్?లో యమగుచితో ఓడిపోవడంతో ఈ టోర్నీలో సింధు జర్నీ ముగిసింది.

# గొలుసుకట్టు చెరువుల పునరుజ్జీవనమే లక్ష్యం....

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ న్యూస్

రాష్ట్రంలో నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయ రంగానికి స్థిరమైన నీటి లభ్యత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జలధార-జలహారతి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన పనుల పురోగతిని పరిశీలించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ఒక చెరువు నుంచి మరొక చెరువుకు నీరు చేరే విధంగా గతంలో ఏర్పాటైన గొలుసుకట్టు వ్యవస్థలను పునరుద్ధరిస్తే వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, భూగర్భ జలాలు కూడా గణనీయంగా మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ దిశగా ప్రతి జిల్లాలో అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.జలధార కార్యక్రమం కింద జరుగుతున్న పనులు కేవలం ఉపాధి హామీ పనులుగా కాకుండా భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే ఆస్తులుగా మారాలని సీఎం పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. నిధుల వినియోగంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.రాష్ట్రంలో త్వరలోనే వర్షాకాలం మరింత ఉధృతం కానున్న నేపథ్యంలో ప్రతి చుక్క వర్షపు నీటిని వడిసిపట్టేలా నీటి వనరులను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. చెరువులు, కుంటలు, కాల్వలు, డ్రైనేజీ మార్గాల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. కాల్వల వెంట ఉన్న ఆక్రమణలు, చెత్త, ఇతర అడ్డంకులను తొలగించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఫామ్‌పాండ్‌లు, కాంటూర్ కందకాల పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ పనులు పూర్తయితే వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకే అవకాశాలు పెరుగుతాయని, రైతులకు భవిష్యత్తులో నీటి కొరత సమస్య తగ్గుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న నీటి వనరుల అభివృద్ధి వల్ల వ్యవసాయ ఉత్పాదకత పెరగడమే కాకుండా పర్యావరణ సమతుల్యత కూడా మెరుగుపడుతుందని వివరించారు.ముఖ్యంగా నీటి మిగులు ఉన్న బేసిన్లను నీటి కొరత ఉన్న ప్రాంతాలతో అనుసంధానించే ప్రణాళికలను వేగవంతం చేయాలని కలెక్టర్లకు సూచించారు. నీటి పంపిణీ సమర్థవంతంగా జరిగేలా జిల్లాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో నీటి వనరుల సమన్వయం ద్వారా భవిష్యత్తులో నీటి సంక్షోభాన్ని తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.చిన్న వాగుల అభివృద్ధికి చిత్తూరు జిల్లా వాల్మీకిపురం వాగు అభివృద్ధి నమూనాను పరిశీలించాలని సీఎం సూచించారు. ఆ నమూనాలో అమలు చేసిన విధానాలను అధ్యయనం చేసి ఇతర జిల్లాల్లో కూడా అవసరమైన చోట అమలు చేయాలని చెప్పారు. ప్రతి జిల్లా తమ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా వినూత్న జల సంరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్‌డ్యామ్‌లు, ఫామ్‌పాండ్‌లు, చెరువులు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని హెచ్చరించారు. కేవలం పనులు పూర్తి చేయడమే కాకుండా వాటి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.నీటి ప్రవాహాలకు ఆటంకం కలిగించే కాల్వల సమస్యలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. కరకట్టలు, కాల్వలు బలహీనంగా ఉన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. వరదల సమయంలో నీటి ప్రవాహం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.జలధార కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని కూడా సీఎం పేర్కొన్నారు. ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు భూగర్భ జలాల పెరుగుదల, నీటి నిల్వ సామర్థ్యం, వ్యవసాయ ఉత్పాదకతపై ప్రభావం వంటి అంశాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని సూచించారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలు సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.జలధార-జలహారతి కార్యక్రమం ప్రభుత్వ పథకంగా మాత్రమే కాకుండా ప్రజల ఉద్యమంగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రైతులు, స్థానిక ప్రజలు, నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామస్థాయిలోని సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు స్వయంగా ముందుండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమీక్ష సమావేశంలో మంత్రి నిమ్మల రామ నాయుడు , జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రాన్ని జలసంపన్నంగా మార్చే దిశగా జలధార-జలహారతి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, వాటి అమలులో అధికారులు అత్యంత చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# కెనడా-బోస్నియా మ్యాచ్ డ్రా

## చివరి నిమిషాల్లో కైల్ లారిన్ అద్భుతమైన గోల్


ఫిఫా ప్రపంచ కప్ 2026 గ్రూప్-బీ ప్రారంభ మ్యాచ్ ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠను రేపింది. టొరంటోలోని బీఎమ్‌ఓ స్టేడియం వేదికగా జరిగిన పోరులో సహ ఆతిథ్య దేశమైన కెనడా, బోస్నియా-హెర్జెగోవినా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. మ్యాచ్ చివరి వరకు బోస్నియా ఆధిక్యంలో ఉంది. అందరూ ఆ జట్టే గెలుస్తుందని అనుకున్నారు. కానీ, చివరి నిమిషాల్లో కెనడా స్టార్ స్ట్రైకర్ కైల్ లారిన్ సబ్‌స్ట్యూట్‌గా వచ్చి అద్భుతమైన గోల్ చేశాడు. దీంతో జట్టును పరాజయం నుంచి రక్షించాడు. దీంతో ఈ టోర్నీలో ఇరు జట్లు చెరో పాయింట్‌తో తమ ఖాతాలను తెరిచాయి. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో కెనడా ఇప్పటివరకు ఆడిన ఏడు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో ఒక్క దాంట్లో కూడా గెలవకపోవడం గమనార్హం. మ్యాచ్ ప్రారంభమైన రెండో నిమిషంలోనే కెనడాకు గోల్ ఖాతా తెరవడానికి అవకాశం లభించింది. లూక్ డి ఫౌగెరోల్స్‌కు గోల్ పోస్ట్ సమీపంలో బంతి అందింది. కానీ, అతను గోల్ కొట్టడంలో విఫలమయ్యాడు. ఆ మరుసటి నిమిషంలోనే బోస్నియా కూడా ఎదురుదాడికి దిగింది. లభించిన ఫ్రీ కిక్‌ను గోల్‌గా మార్చడంలో బోస్నియా ఆటగాడు మెమిచ్ తడబడ్డాడు. మ్యాచ్ 10వ నిమిషంలో కెనడాకు గట్టి షాక్ తగిలింది. బోస్నియా ఆటగాడు మెమిచ్‌ను ప్రమాదకరంగా కింద పడేసినందుకు కెనడా డిఫెండర్ అలిస్టైర్ జాన్‌స్టన్‌కు అంపైర్ పసుపు కార్డు చూపించారు. మ్యాచ్ 21వ నిమిషంలో బోస్నియాకు లభించిన కార్నర్ కిక్‌ను



ఆ దేశ ఆటగాడు ఇవాన్ బేసిక్ అత్యంత చాకచక్యంగా డి-బాక్స్ లోకి పంపాడు. అక్కడ సిద్ధంగా ఉన్న సీద్ కొలాసినాక్ ఆ బంతిని ఫ్లిక్ చేయగా, కేవలం రెండు గజాల దూరం నుంచి జోవో లుకిచ్ అద్భుతమైన హెడర్‌తో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. జోవో లుకిచ్‌కు ఇది అంతర్జాతీయ కెరీర్‌లో మొదటి గోల్ కావడం విశేషం. అంతేకాకుండా, 2014 తర్వాత ప్రపంచకప్‌లో బోస్నియా సాధించిన తొలి గోల్ ఇదే. ఈ గోల్‌తో బోస్నియా 1-0 తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బోస్నియా ఖాతాలో గోల్ పడటంతో కెనడా ఒత్తిడిలో పడింది. స్టార్ ఆటగాడు జోనాథన్ డేవిడ్ గోల్ కోసం కొన్ని మంచి అవకాశాలను సృష్టించినప్పటికీ, బోస్నియా డిఫెండర్లు వాటిని తిప్పికొట్టారు. అయితే, సెకండాఫ్‌లో కెనడా చాకచక్యంగా ఆడింది. 53వ నిమిషంలో కెనడాకు మంచిఅవకాశం లభించింది. స్టీఫెన్ యుస్టాకియో అందించిన అద్భుతమైన పాస్‌ను రిచీ లార్యా అందుకుని గోల్ కీపర్‌ను దాటించి షాట్ కొట్టాడు. అది గోల్ కావడం ఖాయమనుకున్న సమయంలో, బోస్నియా డిఫెండర్ కొలాసినాక్ అద్భుతమైన రీతుల్లో గాల్లోకి లేచి బంతిని నెట్టి గోల్ కాకుండా కాపాడాడు. టైమ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఓటమి ఖాయమనిపిస్తున్న తరుణంలో కెనడా కోచ్ జెస్సీ మార్ష్ ఒక కీలక మార్పు చేశారు. 76వ నిమిషంలో బెంచ్‌పై ఉన్న స్టార్ స్ట్రైకర్ కైల్ లారిన్‌ను మైదానంలోకి దించారు. కోచ్ నమ్మకాన్ని లారిన్ వమ్ము చేయలేదు. మైదానంలోకి వచ్చిన కేవలం మూడు నిమిషాల్లోనే ప్రామిస్ డేవిడ్ అందించిన పాస్‌ను లారిన్ అందుకున్నాడు. ఒక క్విక్ టర్న్‌తో బంతిని నెట్‌లోకి పంపాడు. ఈ గోల్‌తో స్టేడియంలోని కెనడా అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. స్కోరు 1-1 తో సమమైంది. ఆ తర్వాత లారిన్ మరో గోల్ ప్రయత్నం చేసినప్పటికీ బోస్నియా డిఫెండర్ తారిక్ ముహారెమోవిచ్ అడ్డుకోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

# పరాగ్వేను 4-1 తేడాతో చిత్తు చేసిన అమెరికా

ప్రపంచంలోనే అతిపెద్ద ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2026 ఫిఫా వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా జట్టు అద్భుతమైన బోణీ కొట్టింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లోనే పరాగ్వే జట్టును 4-1 తేడాతో చిత్తుచేసి టోర్నీలో మొదటి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సదరన్ కాలిఫోర్నియాలోని సోఫీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు అభిమానులు భారీగా తరలివచ్చారు. 1994 తర్వాత మళ్లీ అమెరికా గడ్డపై ఫిఫా వరల్డ్ కప్ మ్యాచ్ జరగడంతో ఫ్యాన్స్ స్టేడియంను హోరెత్తించారు. ఆ అంచనాలకు తగ్గట్టుగానే అమెరికా ఆటగాళ్లు మైదానంలో చెలరేగిపోయారు. మ్యాచ్ మొదలైన ఏడో నిమిషంలోనే అమెరికా గోల్స్ ఖాతా తెరిచింది. అమెరికా స్టార్ ఆటగాడు పులిసిక్ ఇచ్చిన అద్భుతమైన పాస్‌ను వెస్టన్ మెక్కెన్నీ అందుకోగా పరాగ్వే ఆటగాడు డామియన్ బొబాడిల్లా పొరపాటున చేసిన సెల్ఫ్ గోల్?తో అమెరికాకు 1-0 లీడ్ దక్కింది. ఆ తర్వాత 31వ నిమిషంలో ఫోలారిన్ బలోగున్ అమెరికాకు రెండో గోల్ అందించాడు. హాఫ్ టైమ్ ముగిసే సమయానికి బలోగున్ మరోసారి పరాగ్వే డిఫెండర్లను ఏమార్చి అద్భుతమైన గోల్ చేశాడు. దీంతో ఫస్ట్ హాఫ్ పూర్తయ్యే సరికి అమెరికా 3-0 ఆధిక్యంలోకి వెళ్లిపోయి మ్యాచ్‌ను తమ కంట్రోల్?లోకి తీసుకుంది. సెకెండ్? హాఫ్‌లో 73వ నిమిషంలో పరాగ్వే ఆటగాడు మౌరిసియో గోల్ కొట్టాడు. దీంతో అమెరికా లీడ్ 3-1కి తగ్గింది. ఆట అదనపు సమయంలో అమెరికా (90౦8 నిమిషాల వద్ద) ప్లేయర్ గివోన్ని రీనా అదిరిపోయే గోల్ కొట్టి 4-1 తేడాతో తన జట్టును గెలిపించాడు. పరాగ్వే (37 శాతం)తో పోలిస్తే బంతిపై నియంత్రణ యూఎస్?కే (63 శాతం) ఎక్కువగా ఉంది. ఈ మ్యాచ్‌లో అమెరికా విన్నింగ్ గోల్స్ వెనుక కీ రోల్ ప్లే చేసిన పులిసిక్ ఫస్ట్ హాఫ్ చివర్లో గాయపడ్డాడు.



పరాగ్వే ఆటగాళ్లు బంతిని లాక్కునే క్రమంలో అతని కాలిపై గట్టిగా తన్నడంతో కోచ్ మారిసియో పోచెట్టినో వెంటనే అలర్ట్ అయ్యాడు. టోర్నీ ఇంకా చాలా రోజులు ఉండటంతో ఎలాంటి రిస్క్ తీసుకోకుండా హాఫ్ టైమ్‌లోనే పులిసిక్‌ను మైదానం నుంచి బయటకు పిలిపించి అతని స్థానంలో సెబాస్టియన్ బెర్హాల్టర్‌ను గ్రౌండ్ లోకి దించాడు. తన గాయం పెద్దదేమీ కాదని ముందు జాగ్రత్తగానే బయటకు వచ్చానని నెక్స్ట్ మ్యాచ్‌కు కచ్చితంగా అందుబాటులో ఉంటానని పులిసిక్ చెప్పాడు.సెకండ్ హాఫ్‌లో పరాగ్వే కాస్త పుంజుకునే ప్రయత్నం చేసింది. మ్యాచ్ 73వ నిమిషంలో ఆ జట్టు ఆటగాడు మారిసియో ఒక గోల్ చేసి స్కోరును 3-1 కి చేర్చాడు. కానీ ఆ తర్వాత అమెరికా డిఫెన్స్ ను దాటి పరాగ్వే ఆటగాళ్లు ముందుకు రాలేకపోయారు. ఇక మ్యాచ్ అదనపు సమయంలో అమెరికా ఆటగాడు జియో రేనా పెనాల్టీ బాక్స్ బయట నుంచి కళ్లుచెదిరే షాట్‌తో బంతిని డైరెక్ట్?గా నెట్‌లోకి పంపి స్కోరును 4-1గా మార్చాడు. ఇది ఈ మ్యాచ్?కే హైలైట్?గా నిలిచింది. దీంతో పరాగ్వే ఆట పూర్తిగా ముగిసిపోయింది. ఇక ఇదే వరల్డ్ కప్‌లో భాగంగా ఆతిథ్య దేశాల్లో ఒకటైన కెనడా జట్టు కూడా తమ తొలి మ్యాచ్ ఆడింది. టొరంటోలో జరిగిన ఈ మ్యాచ్‌లో కెనడా జట్టు బోస్నియాతో 1-1 తో డ్రా చేసుకుంది. 78వ నిమిషంలో కెనడా ఆటగాడు కైల్ లారిన్ గోల్ చేసి జట్టును ఓటమి నుంచి కాపాడాడు. ఈ టోర్నీలో అమెరికా తమ తదుపరి మ్యాచ్‌ను వచ్చే శుక్రవారం సియాటెల్‌లో ఆడనుంది. అలాగే కెనడా జట్టు గురువారం వాంకోవర్‌లో ఖతార్‌తో తలపడనుంది. ఓవరాల్‌గా ఫస్ట్ మ్యాచ్ విజయంతో అమెరికా టీమ్ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో కనిపిస్తోంది.

# జీ5లో ఫిఫా వరల్డ్ కప్

ఫిఫా వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి కొన్ని రోజుల ముందే ఇండియాలోని ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు ఒక బిగ్ గుడ్ న్యూస్ అందింది. ఇండియాకు చెందిన ప్రముఖ బ్రాడ్‌కాస్టర్లు ఫిఫా సంస్థతో రేట్ల విషయంలో చర్చల లూప్‌లో ఇరుక్కుపోయిన వేళ, జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. తన సరికొత్త స్పోర్ట్స్ ఛానెల్ 'యునైట్8'), డిజిటల్ ప్లాట్‌ఫామ్ జీ5 ల ద్వారా ఈ మెగా టోర్నీని ఇండియాలో టెలికాస్ట్ చేయనుంది. ఈ బిగ్ డెసిషన్ వెనుక ఉన్న లాంగ్ టర్మ్ విజన్ గురించి యునైట్8 స్పోర్ట్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ భవేష్ జనవ్లేకర్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఫిఫా వరల్డ్ కప్ రైట్స్ కోసం ఇతర పెద్ద నెట్‌వర్క్‌లు వెనకడుగు వేసినా జీ గ్రూప్ ఎందుకు ముందుకు వచ్చిందనే దానికి భవేష్ క్లారిటీ ఇచ్చారు. స్పోర్ట్స్ అనేది తమకు షార్ట్ టర్మ్ గేమ్ కాదని, మార్కెట్ శబ్దాలను పట్టించుకోకుండా లాంగ్ టర్మ్ స్ట్రాటజిక్ నమ్మకంతోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఫిఫా వరల్డ్ కప్ అనేది కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదని, గ్లోబల్ స్పోర్ట్స్ ఇండస్ట్రీలో ఒక స్ట్రాంగ్ ఫౌండేషన్ క్రియేట్ చేయడానికి ఇది హెల్ప్ అవుతుందని చెప్పారు. ఇండియాలో యంగ్ అండ్ డిజిటల్ వ్యూయర్స్ ఇంట్రెస్ట్స్ మారుతున్నాయని, అందువల్ల మల్టీలింగ్వల్ కవరేజ్, రీజనల్ లాంగ్వేజెస్ సపోర్ట్‌తో ఈ మ్యాచ్‌లను అందరికీ అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఇండియాలో కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా ఫుట్‌బాల్, కబడ్డీ లాంటి ఆటలకు కూడా విపరీతమైన క్రేజ్ పెరుగుతోందని భవేష్ అన్నారు. వెస్ట్ బెంగాల్, కేరళ, గోవా, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల్లో ఫుట్‌బాల్‌కు ఒక కల్చరల్ కనెక్ట్ ఉందని గుర్తు చేశారు. ఆల్రెడీ జీ5 ద్వారా కలకత్తా ఫుట్‌బాల్ లీగ్, బెంగాల్ సూపర్ లీగ్ లను ప్రసారం చేసి సక్సెస్ అయ్యామని చెప్పారు. ఐఎల్‌టి20, యూపీ కబడ్డీ లీగ్ లాంటి ప్రాపర్టీస్ ద్వారా ఇండియా అంతటా అన్ని ప్రాంతాల ఆడియన్స్‌కు రీచ్ అవ్వడమే తమ టార్గెట్ అని వెల్లడించారు. టైమ్ జోన్ తేడాల వల్ల రాత్రి పూట మ్యాచ్‌లు ఉన్నప్పటికీ, ఇండియాలోని క్రేజీ ఫుట్‌బాల్ లవర్స్ ఖచ్చితంగా లైవ్ చూస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ డీల్‌లో కేవలం ఈ ఏడాది వరల్డ్ కప్ మాత్రమే కాకుండా ఇతర చిన్న ఫిఫా ఈవెంట్స్ కూడా భాగమయ్యాయి. దీనివల్ల ఫ్యాన్స్‌తో కంటిన్యూయస్ కనెక్టివిటీ ఉంటుందని భవేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. స్పెయిన్ కో-హోస్ట్ చేయబోయే 2030 వరల్డ్ కప్ వరకు తమ స్పోర్ట్స్ గ్రోత్ ప్లాన్స్ విస్తరించి ఉన్నాయని హింట్ ఇచ్చారు. ఫుట్‌బాల్‌తో పాటు ఇండియాస్ టూర్ ఆఫ్ జింబాబ్వే క్రికెట్ సిరీస్ బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్‌ను కూడా యునైట్8 స్పోర్ట్స్ సొంతం చేసుకుందని, టీమిండియా మ్యాచ్‌ల ద్వారా తమ ఛానెల్ రేటింగ్స్ మరింత పెరుగుతాయని స్పష్టం చేశారు. గ్లోబల్ స్కేల్, రీజనల్ అఫినిటీలను బ్యాలెన్స్ చేస్తూ ఒక ఫ్యూచర్ రెడీ స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను బిల్డ్ చేయడమే తమ ఫైనల్ గోల్ అని వివరించారు.

26-5-26 rakshana main_Layout 1 6/14/2026 4:25 AM Page 4





# పూరీ మార్క్... స్లమ్ డాగ్ టీజర్



డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.

## మా ఇంటి బంగారం సమంత కోసం వెయిటింగ్

మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యూఏ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు.. వెచ్చించే సమయానికి.. అన్నింటికీ న్యాయం చేసేలా ఉంటుంది' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.



## నానీ మూవీలో రుక్మిణీ వసంత్

సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.

# కిరణ్ అబ్బవరం కెఎ 13

## సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.



Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District